
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 30 సెప్టెంబరు 2025

బీఈడీ నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ బీఈడీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల నాలుగో సెమిస్టర్ ఫలితాలను సోమవారం విడుదల చేశారు. ఈ పరీక్షలకు 1,035 మంది విద్యార్థులు హాజరుకాగా 969 మంది ఉత్తీర్ణులయ్యారు. 93.62 శాతం ఫలితాలు సాధించారు. ఫలితాలపై ఎలాంటి సందేహాలు ఉన్నా 15 రోజుల్లో పునః మూల్యాంకనానికి దరఖాస్తు చేసుకోవాలని డీన్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు. ఫలితాల వివరాలను వర్సిటీ వెబ్‌సైట్, జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులో ఉంచామన్నారు.

చెరువులను.. చెరబట్టారు

● లావేరు మండలంలో యథేచ్ఛగా ఆక్రమణలు ● కొత్తకుంకాం, కొండకుంకాంలో కనుమరుగవుతున్న వైనం

● ఆయకట్టు రైతులకు సాగునీటి ఇబ్బందులు



కొండకుంకాంలో అక్కమ్మ చెరువును చదును చేసిన దృశ్యం

● లావేరు మండలం కొండకుంకాం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 67, ఎల్‌పీ నెంబరు 887లో ఉన్న అక్కమ్మ చెరువు గర్భం 5.19 ఎకరాలు ఉండేది. సుమారు 20 ఎకరాల ఆయకట్టు భూమికి సాగునీరు అందించేది. కాగా.. ఈ చెరువు ఆక్రమణకు గురై ప్రస్తుతం 1.50 ఎకరాలు మాత్రమే మిగిలింది. సాగునీరు సక్రమంగా అందక ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

లావేరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): లావేరు మండలంలో భూబకాసురులు రెచ్చిపోతున్నారు. ఇన్నాళ్లూ కొండలు, ఖాళీ స్థలాలను కబ్జా చేయగా.. ప్రస్తుతం చెరువులను సైతం యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. చెరువు గర్భాలను చదును చేసి.. కొంతమంది మొక్కజొన్న సాగు చేస్తున్నారు. మరి కొందరు సరుగుడు, నీలగిరి మొక్కల పెంపకం చేపడుతున్నారు. ప్రధానంగా కొత్తకుంకాం, కొండకుంకాం గ్రామాల్లో పలు చెరువులు ఆక్రమణకు గురై కనుమరుగవుతున్నాయి. ఈ ప్రాంత రైతులు వర్షాధారంపైనే సాగు చేస్తున్నారు. చెరువుల్లో నీటిని ఆయకట్టుకు మళ్లించి.. వరి, మొక్కజొన్న పంటలను పండించేవారు. కాగా ఒకప్పుడు నీటితో కళకళలాడే చెరువులు ఆక్రమణదారుల చెరలో పడి నేడు వెలవెలబోతున్నాయి. కొన్నిచోట్ల చెరువుల నామరూపాలు లేకుండా పోయాయి. దీంతో తమకు సాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదని ఆయకట్టు రైతులు (మిగతా 6వ పేజీలో..)



కొత్తకుంకాంలో ఆక్రమణ చెరలో పెద్ద కోనేరు చెరువు

● కొత్తకుంకాం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 55లో పెద్ద కోనేరు చెరువు ఉంది. ఈ చెరువు మధ్యలో నుంచి మడ్డువలస సాగునీటి కాలువ ఏర్పడింది. దీని వలన ఆచెరువు రెండు పాయలుగా చీలిపోయింది. ఒకవైపు విడిపోయిన రెండు ఎకరాల విస్తీర్ణం గల చెరువును గ్రామానికి చెందిన కొంత మంది ఆక్రమించేస్తున్నారు. ఇప్పటికే ఎకరా వరకూ ఆక్రమించగా.. దీనిపై కొంతమంది యువకులు ఇటీవల ఆక్రమణదారులను ప్రశ్నించారు. కాగా.. 'ఇదేం మా సొంతానికి కాదు. మన ఊర్లో ఉన్న దేవాలయానికి ఆదాయం తేవాలనే కారణంతో ఈ చెరువును చదును చేస్తున్నాం. ఈ స్థలంలో నీలగిరి, సరుగుడు మొక్కలను వేయనున్నామ'ని వారు బదులిస్తున్నారు. అయితే.. అవన్నీ ఉత్తి మాటలేనని.. ఆక్రమణకు యత్నిస్తున్నారని యువకులు ఆరోపిస్తున్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చూడండి

● నానో ఎరువుల ప్రయోజనాలు తెలియజేయండి
● అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం

6 లో

అమ్మానాన్న కష్టాన్ని అర్థం చేసుకుని..

● చదువులో రాణించిన నిరోషా
● ఒకేసారి ఆరు ఉపాధ్యాయ పోస్టులకు ఎంపిక

పని ఒత్తిడి తగ్గించాలని..

● సచివాలయ ఉద్యోగుల నిరసన

7 లో



హార్డ్‌వేర్ షాపులో అగ్నికీలలు

నీరందక.. మంటలు ఆర్పలేక

● మొరాయించిన అగ్నిమాపక వాహనం
● పాలకొండ నుంచి శకటం వచ్చినా ఫలితం లేని వైనం
● 70 లక్షల ఆస్తి నష్టం
● కొత్తూరులో హార్డ్‌వేర్ షాపు దగ్ధం

8 లో



ఈ ఇళ్లలోనే చోరీ జరిగింది

పోర్టు కళింగపట్నంలో భారీ చోరీ

● 59 తులాల బంగారు ఆభరణాలు అపహరణ
● క్లూస్ టీమ్‌తో నిందితుల వివరాలు సేకరణ

గార రూరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): గార మండలం పోర్టు కళింగపట్నంలో ఆదివారం రాత్రి భారీ చోరీ జరిగింది. మూడిళ్లలో సుమారు 59 తులాల బంగారం ఆభరణాలు, రూ.లక్ష నగదు అపహరణకు గురైంది. ఇందుకు సంబంధించి బాధితులు, గార పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోర్టు కళింగపట్నానికి చెందిన మైళపిల్లి శంకర దాస్‌కు చెందిన మూడు ఇళ్లల్లో ఆదివారం రాత్రి దొంగలు పడ్డారు. శంకరదాస్‌కు చెందిన ఒక ఇంట్లో ఆయన మేనల్లుడు పప్పు దీపక్(వైజాగ్), మరో ఇంట్లో ఆయన తల్లి పోలమ్మ, ఇంకో ఇంట్లో చెల్లి పద్మావతి నివాసం ఉంటున్నారు. శంకర్‌దాస్ శ్రీకాకుళంలో నివసిస్తున్నారు. పప్పు దీపక్ సీమెన్‌గా పనిచేస్తున్నారు. ఉద్యోగరీత్యా విధుల్లో చేరేందుకు ఆదివారం ఉదయం ఇంటికి తాళం వేసి విశాఖపట్నం వెళ్లిపోయారు. శంకర్‌దాస్ తల్లి పోలమ్మ అనారోగ్యం కారణంగా కొన్నాళ్లుగా శ్రీకాకుళంలోని ఆయనే వద్ద ఉంటున్నారు. ఆ రెండిళ్లలో ఎవరూ లేకపోవడంతో.. చివరింట్లో ఒంటరిగా ఉండలేక పద్మావతి కూడా ఆదివారం రాత్రి ఇంటికి తాళం వేసి.. గ్రామంలో వేరే దగ్గర నివసిస్తున్న తన అక్క ఇంటికి వెళ్లిపోయింది. ఆమె సోమవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా.. గేటు తాళాలతోపాటు మూడు ఇళ్ల తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఈ విషయాన్ని ఫోన్‌లో తన అన్న శంకర్‌దాస్‌కు (మిగతా 6వ పేజీలో..)



శంకర్‌దాస్ వద్ద వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ గంగరాజు

మత్తుపదార్థాల వినియోగంపై ఉక్కుపాదం

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పక్కన ఎస్పీ

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా, విక్రయాలను పూర్తిగా అరికట్టాలి. వీటిపై ఉక్కుపాదం మోపాల'ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డితో కలిసి నార్కొటిక్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'విద్యార్థులు, వర్కర్లు, డ్రైవర్లను లక్ష్యంగా చేసుకుని గంజాయి సరఫరా జరుగుతోంది. ఈ నేపథ్యంలో గట్టి నిఘా అవసరం. డ్రగ్స్ విక్రయాల ప్రాంతాల్లో కఠిన తనిఖీలతో పాటు బాధితులకు కౌన్సెలింగ్, పునరావాసం కల్పించాలి. స్కూళ్లు, కళాశాలల్లో క్రమం తప్పకుండా అవగాహన సదస్సులు నిర్వహించాలి. డ్రగ్స్‌రహిత సమాజంపై సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం (మిగతా 6వ పేజీలో..)

రక్తనిల్వల కొరత

● జిల్లాకు 30వేల యూనిట్లు అవసరం
● అందుబాటులో 16 వేల యూనిట్లు మాత్రమే
● అత్యవసర సమయాల్లో తప్పని మూల్యం
● అపోహలతో ముందుకురాని ప్రజలు



ఇచ్ఛాపురం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రక్తనిల్వల కొరత అధికంగా ఉంది. రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నా దాతలు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. చాలామంది అపోహలతో ముందుకు రావడం లేదు. దీంతో రక్త సేకరణ తగ్గుతోంది. జిల్లాకు 30వేల యూనిట్లు రక్తనిల్వలు అవసరం కాగా.. 16వేల యూనిట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీంతో అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు రక్తనిధి కేంద్రాల్లో కొనుగోలు చేయాల్సి వస్తోంది. జిల్లాలో శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(రిమ్స్), శ్రీకాకుళం రెడ్‌క్రాస్ కేంద్రం, టెక్కలి జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రి, పాతపట్నం సామాజిక ఆస్పత్రి, శ్రీకాకుళం లయన్స్ రక్తనిధి కేంద్రాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం మలేరియా, డెంగ్యూ వంటి విష జ్వరాలతోపాటు డయేరియా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఎక్కువ మందిలో ప్లేట్‌లెట్స్ పడిపోతున్నాయి. ఈ క్రమంలో రక్తం అవసరం ఎక్కువగా ఉంటుంది. కానీ ఆశించిన స్థాయిలో రక్తం లభ్యత లేదు. ప్రమాదాలు, వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారికి రక్తం అత్యవసరమైన సందర్భాల్లో అవస్థలు తప్పడం లేదు. జిల్లాలో ప్రైవేటు బ్లడ్‌బ్యాంకుల్లో పరపతి ఉంటేనే రక్తం దొరుకుతుందన్న విమర్శలు ఉన్నాయి. కొన్నిచోట్ల రోగికి అవసరం మేరకు డబ్బులు ఎక్కువగా డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. బ్లడ్ బ్యాంకుల వద్ద నిబంధనలు పక్కాగా ఉండాలి. కేంద్రాల్లో అందుబాటులో ఉన్న రక్తం, గ్రూపులు, ధరలు, సంప్రదించాల్సిన నంబర్లను సూచిక బోర్డులో స్పష్టంగా రాసి ఉంచాలి. సంబంధిత వెబ్‌సైట్‌లో ఎప్పటికప్పుడు వివరాలను నమోదుచేయాలి. డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా(డీసీజీఐ) నిబంధనల ప్రకారం రక్తం ప్యాకెట్లకు ప్రాసెసింగ్ ఫీజు మాత్రమే వసూలు చేయాలి. తాజా మార్గదర్శకాల ప్రకారం రక్తం లేదా రక్త విభాగాలకు రూ.250 నుంచి (మిగతా 6వ పేజీలో..)



రక్తదానం మహోన్నతం

రక్తదానం మహోన్నతమైనది. ఎన్నిసార్లైనా రక్తదానం చేయవచ్చు. తద్వారా ఆపదలో ఉన్న ఎంతో మందిని కాపాడవచ్చు. రక్తదానంపై అపోహలను నియంత్రించాల్సిన అవసరం ఉంది. ప్రాథమిక స్థాయి నుంచే పిల్లలకు రక్తదానంపై అవగాహన పెంచాలి. ఆరోగ్యకరమైన సమాజంలో భాగస్వామ్యం చేయాలి.

\- డాక్టర్ కొంతాల గోవింద్‌రెడ్డి(గోపి), ఇచ్ఛాపురం



తామరాపల్లిలో ఈ క్రాప్ నమోదు చేస్తున్న అధికారులు

ఒక్కరోజే

● ఈ-క్రాప్ నమోదుకు నేటితో గడువు పూర్తి
● జిల్లాలో నత్తనడకన ప్రక్రియ

నరసన్నపేట, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. పంట రుణాలపై వడ్డీ రాయితీ, విపత్తుల సమయంలో పంట నష్ట పరిహారం పొందాలన్నా.. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలన్నా ఈ-క్రాప్ నమోదే ప్రామాణికం. ఈ మేరకు ఖరీఫ్‌లో సాగు నమోదుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి.. ఈ-క్రాప్ నమోదు చేయాల్సిందేనని స్పష్టం చేసింది. అలాగే సాగుహక్కు కార్డులు పొందిన కౌలురైతులకూ ఈ-క్రాప్ నమోదుకు అవకాశం కల్పించింది. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో వరి, మొక్కజొన్న, పత్తి, చెరుకు 4,93,382 ఎకరాల్లో సాగుచేస్తున్నారు. వీటిలో వరి అత్యధికంగా 3.94 లక్షలు ఎకరాల్లో పండిస్తున్నారు. ఆగస్టులో (మిగతా 6వ పేజీలో..)

సరస్వతీదేవిగా దుర్గమ్మ

● చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం

అరసవల్లి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా దుర్గమ్మ.. సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. సోమవారం బలగలోని శ్రీ బాలత్రిపుర కాలభైరవఆలయంలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి పూజలు చేశారు. సుమారు వెయ్యిమంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. పిల్లలకు పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. అలాగే శ్రీకాకుళం ఏడురోడ్ల జంక్షన్ వద్ద శ్రీ కనకదుర్గమ్మ, సంతోషిమాత ఆలయాల్లో కూడా అమ్మవార్లను సరస్వతీదేవిగా అలంకరించి.. సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.





బాలత్రిపుర సుందరి ఆలయంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం

పిడుగుపడి ఒకరి మృతి

కొత్తూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలం సిరుసువాడకు చెందిన కోటిలింగాల హరిశ్చంద్రుడు(50) పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఆ సమయంలో పెరట్లోకి హరిశ్చంద్రుడు వెళ్లగా పిడుగు పడడంతో అపస్మారక స్థితికి చేరుకున్నారు. వెంటనే కుటుంబ సభ్యులు ఆయనను కొత్తూరులో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే హరిశ్చంద్రుడు మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు విలపించారు. హరిశ్చంద్రుడుకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగించేవారు. పిడుగుపాటుతో మృతి చెందడంతో ఇక తమకు దిక్కెవరని కుటుంబ సభ్యులు రోదించారు.

సరస్వతీదేవిగా దుర్గమ్మ

దుర్గా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారిని సోమవారం సరస్వతీదేవిగా అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కొన్నిచోట్ల దుర్గమ్మ సన్నిధిలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. జిల్లాలోని వివిధ ఆలయాల్లో అమ్మవార్లను భారీ సంఖ్యలో భక్తులు దర్శించుకొని..ప్రత్యేక పూజలు చేశారు.

- ఆంధ్రజ్యోతి బృందం


పలాస: జ్ఞానసరస్వతి ఆలయంలో అక్షరాభ్యాసాలకు హాజరైన చిన్నారులు, తల్లిదండ్రులు



శ్రీకాకుళం: బాలత్రిపుర సుందరి ఆలయంలో అక్షరాభ్యాసాలకు హాజరైన జనం


శ్రీకాకుళం: అక్షరాభ్యాసం చేయిస్తూ..


సోంపేట: సరస్వతీదేవి అవతారంలో..


శ్రీకాకుళం:పాత శ్రీకాకుళంలో సరస్వతీ దేవిగా సంతోషిమాత


నరసన్నపేట: సోమేశ్వర స్వామి ఆలయంలో సరస్వతీ దేవిగా..


శ్రీకాకుళం: ఏడు రోడ్ల జంక్షన్‌లో..


కవిటి: భూలోకమాత అమ్మవారు


కంచిలి: కంచమ్మ తల్లి అమ్మవారు


టెక్కలి: ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో..


పాతపట్నం: సరస్వతీదేవిగా పూజలు అందుకున్న నీలమణిదుర్గ


ఇచ్ఛాపురం: బూర్జపాడులో సామూహిక కుంకుమ పూజలు


ఆమదాలవలస: రైల్వేస్టేషన్ ఆవరణలో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాలు


నందిగాం: పూజల్లో పాల్గొన్న మహిళలు


జలుమూరు: సారవకోట మండలం అవలింగిలో విద్యార్థుల దసరా సందడి


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అర్జీల పరిష్కారంలో ఆలస్యం వద్దు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆలస్యం కాకుండా అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆయన జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 93 అర్జీలను స్వీకరించారు. వివిధశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏ శాఖకు ఎన్ని పీజీఆర్ఎస్ దరఖాస్తులు వస్తున్నాయి? ఎన్ని పరిష్కరించారన్న వివరాలను ఆరా తీశారు. అలాగే సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, ఉప కలెక్టర్ పద్మావతి, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు బాగు చేయరూ

తోటపాలెం నుంచి అంబేడ్కర్ నగర్ వరకు గల ఎనిమిది గ్రామాలకు చెందిన 6 కిలోమీటర్ల రోడ్డు పూర్తిగా పాడైపోయి 20 సంవత్సరాలు కావస్తోందని... పెద్ద పెద్ద గుంతల వల్ల ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు. శ్రీకాకుళం నగరానికి ఆనుకుని ఉండడం... నిత్యం ఉద్యోగం, వ్యాపారం, విద్య కోసం ప్రజలు, విద్యార్థులు ఇదే గుంతల రోడ్డులో ప్రయాణిస్తూ రాత్రివేళల్లో ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. దయచేసి ఇప్పటికైనా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని 8 గ్రామాలకు చెందిన ప్రజలు సోమవారం జెడ్పీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

కోతుల బారి నుంచి కాపాడండి

కోతుల బారి నుంచి కాపాడాలని మెళియాపుట్టి మండలం తూము రామచంద్రాపురం గ్రామానికి చెందిన గిరిజనులు కలెక్టర్‌ను కోరారు. గతీ ఏడాది ఒడిశా నుంచి తీసుకు వచ్చి కోతులను తమ గ్రామం వద్ద వదిలేశా రని తెలిపారు. దీంతో సుమారు 500 నుంచి 600 వరకు కోతులు జీడి, మామిడి, వరి, అరటి, కూరగాయల పంటలను పూర్తిగా నాశనం చేస్తున్నాయని తెలిపారు. స్థానిక ఎమ్మార్వో, అటవీ అధికారులకు సమస్యను విన్నవించుకున్నా ఫలితం లేదన్నారు. దయచేసి కోతుల బెడద నుంచి కాపాడాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.


కోతుల బారి నుంచి కాపాడాలని కోరుతున్న గిరిజనులు

6 నెలలుగా ట్రెజరీ అధికారులు వేధిస్తున్నారు

'నా భర్తకు ఓపెన్ హార్ట్ ఆపరేషన్ జరిగింది. మెడికల్ రీయింబర్స్‌మెంట్ కోసం, దానికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను సమర్పించాం. కానీ ఆరు నెలలు గడుస్తున్నా సంబంధిత ట్రెజరీ అధికారి కుంటిసాకులు చెబుతూ నిలిపేస్తున్నారు. అంతే కాకుండా మమ్మల్ని మానసికంగా వేధిస్తున్నారు. దయచేసి రీయింబర్స్‌మెంట్ ఇప్పించి మాకు న్యాయం చేయాల'ని కోరుతూ టెక్కలికి చెందిన బి.నాగమణి సోమవారం కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో అర్జీని సమర్పించారు.

అమ్మానాన్న కష్టాన్ని అర్థం చేసుకుని..

- చదువులో రాణించిన నిరోషా
- ఒకేసారి ఆరు ఉపాధ్యాయ పోస్టులకు ఎంపిక

రాజాం రూరల్/శ్రీకాకుళం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా.. ఏదైనా ఓ చిన్నపాటి ఉద్యోగం సంపాదిస్తే చాలు.. ఎం తో సాధించినట్టు సంబరపడిపోయే రోజులివి. అలాంటిది ఒకేసారి ఆరు ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికై... అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తారు టెక్కలి మండలం పరశురాంపురం గ్రామానికి చెం దిన కె.నిరోషా. రాజాంలోని ఓ కోచింగ్ సెంటర్ నిర్వాహకుల సారథ్యంలో డీఎస్సీకి శిక్షణ పొందిన ఆమె ఈ నెల 25న అమరావతిలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నుంచి సత్కారం అందుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నుంచి నియామక పత్రం అందుకున్నారు.

గ్రామీణ నేపథ్యం నుంచి...

నిరోషా తండ్రి కెవిటివాడు టెక్కలిలోని ఓ క్వారీలో కార్మికుడిగా... తల్లి ఆదిలక్ష్మి దినసరి కూలీగా పని చేస్తూ.. కష్టపడి ఇద్దరు ఆడపిల్లలను చదివించారు. తల్లిదండ్రుల కష్టాన్ని చిన్ననాటి నుంచి చూసిన నిరోషా జీవితంలో ఉన్నత స్థానంలో ఉండాలని నిర్ణయించుకున్నారు. ఆ దిశగా నిరంతరం సాధించారు. తొలి ప్రయత్నంలోనే ఆరు పోస్టులకు ఎంపికై సత్తా చాటారు. రాజాంలోని విజేత కోచింగ్ సెంటర్ నిర్వాహకులు అప్పలరాజు మాస్టర్, ఉపాధ్యాయ బృందం తన విజయానికి కారకులని నిరోషా చెబుతున్నారు. కొల్లివలస ఏపీజీవీబీ బ్రాంచి మేనేజర్‌గా పనిచేస్తున్న భర్త వెంకటరావు సహకారం కూడా తన విజయానికి మరో కారణంగా చెప్పుకొచ్చారు. నిరోషాకు ఇద్దరు ఆడపిల్లలు.

తొలి ప్రయత్నంలోనే..

తొలి ప్రయత్నంలోనే ఆరు ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన నిరోషా ప్రాథమిక విద్య నుంచి బీఈడీ వరకూ ప్రభుత్వ విద్యా సంస్థలలోనే పూర్తి చేశారు. ఎంపికైన ఆరు ఉపాధ్యాయ పోస్టులలో స్కూల్ అసిస్టెంట్ (సోషల్) ఉద్యోగాన్ని నిరోషా ఎంచుకున్నారు. పీజీటీ సోషల్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన ఆమె.. స్కూల్ అసిస్టెంట్ (సోషల్) విభాగంలో 3వ ర్యాంకు (శ్రీకాకుళం జిల్లా ఫస్ట్ ర్యాంకు)ను కైవసం చేసుకున్నారు. టీజీటీ సోషల్‌లో 14వ ర్యాంకు (జోనల్ 7 ర్యాంకు), స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్), పీజీటీ (ఇంగ్లీష్), టీజీటీ ఇంగ్లీష్ కేటగిరీలలోనూ ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు.


సీఎం చంద్రబాబు నుంచి నియామక పత్రాన్ని అందుకుంటున్న నిరోషా (ఫైల్)

సాంఘికశాస్త్రం ప్రాముఖ్యతను గుర్తించేలా...

సాంఘికశాస్త్రాన్ని చాలామంది బోరింగ్ సబ్జెక్ట్‌గా పరిగణిస్తారు. అది కూడా ఓ మంచి సబ్జెక్ట్‌గా భవిష్యత్‌లో అందరూ భావించేలా, దాని విలువను అందరికీ తెలిసేందుకు కృషి చేస్తాను. సోషల్‌లో మంచి విద్యార్థులను తయారు చేసి... పోటీ పరీక్షలకు హాజరయ్యేలా నావంతు కృషి చేస్తాను.

- నిరోషా



చెరువులను.. చెరబట్టారు

(ఐదో పేజీ తరువాయి)

ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు ఇక్కడ చెరువులు ఉన్నాయని చెప్పుకునే దుస్థితి ఎదురవుతోందని వాపోతున్నారు. చెరువుల ఆక్రమణపై అధికారులకు పలుమార్లు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పందించి.. ఆక్రమణలు తొలగించాలని, చెరువులను పరిరక్షించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఈ విషయమై తహసీల్దార్ జీఎల్‌వీ శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా.. ఆక్రమణకు గురైన చెరువులను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

ఆక్రమణలెన్నో..

- కొత్తకుంకాం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 202లో జగన్నాథ బందదీ అదే పరిస్థితి. గతంలో జగన్నాథ బంద గర్భం 5.37 ఎకరాల వరకు ఉండగా.. ఆక్రమణలకు గురై ప్రస్తుతం 1.70 సెంట్లు మాత్రమే మిగిలిందని రైతులు వాపోతున్నారు. ఈ చెరువు కింద ఆయకట్టు 15 ఎకరాల వరకు ఉందని, ఆక్రమణల కారణంగా సాగునీరు అందడం లేదని పేర్కొంటున్నారు.
- కొత్తకుంకాం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 216-10లో చాకలి కోనేరు గర్భం 1.60 ఎకరాలకుగాను ఆక్రమణల కారణంగా కేవలం 70సెంట్లు మాత్రమే మిగిలింది. ఈ చెరువు కింద సుమారు 5 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉందని రైతులు తెలిపారు. ఉపాధిహామీ పథకం కింద కొన్నాళ్లగా ఈ చెరువు అభివృద్ధి కోసం ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించిందని పేర్కొన్నారు. ఆక్రమణల కారణంగా ఆ నిధులు కూడా వృథా అయ్యాయని వాపోతున్నారు.
- లావేరు మండలం చినమురపాకలోని డాబాలవానిచెరువు ఆక్రమణకు గురైంది. ఈ చెరువు గర్భం సుమారు 350 ఎకరాలు ఉండేది. ఈ చెరువు నీటి ఆధారంగా దాదాపు 750 ఎకరాల్లో ఆయకట్టు సాగు చేసేవారు. కాగా ఈ చెరువు క్రమేపీ సుమారు 75 ఎకరాల మేరకు ఆక్రమణకు గురైంది. ఆ భూమిలో ప్రస్తుతం కొందరు వరి, పత్తి పండిస్తున్నారు. కొంతమంది సరుగుడు, నీలగిరి మొక్కలు పెంచుతున్నారు. ఇంకొందరు పంట కళ్లాలుగా వినియోగిస్తున్నారు.

రక్తనిల్వల కొరత

(ఐదో పేజీ తరువాయి)

రూ.1550 వరకూ మాత్రమే తీసుకోవాలి. ఈ మేరకు రాష్ట్ర ఔషధ నియంత్రణ అధికారులకు డీసీజీఐ ఆదేశించింది. కానీ ఈ నిబంధనలేవీ సక్రమంగా అమలుకావడం లేదు. అలాగే దాతలు రక్తం ఇచ్చి.. తమకు కావాల్సిన గ్రూపు రక్తాన్ని తీసుకుంటామన్నా కొన్ని బ్లడ్‌బ్యాంకుల్లో లభించని దుస్థితి నెలకొంది. ముఖ్యంగా కృత్రిమ కొరత సృష్టించి అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

ఎన్నిసార్లయినా దానం చేయవచ్చు

సాధారణ వ్యక్తి తన శరీరంలో దాదాపు ఐదు లీటర్ల రక్తం కలిగి ఉంటాడు. ఎటువంటి అనారోగ్యం లేని వ్యక్తి రక్తాన్ని దానం చేయవచ్చు. 18 సంవత్సరాల నుంచి క్రమం తప్పకుండా రక్తదానం చేస్తే.. జీవితకాలంలో దాదాపు 168 సార్లు రక్తదానం చేయవచ్చు అని నిపుణులు చెబుతున్నారు. రక్తదానం చేయడం వల్ల పెద్దపేగు, ఊపిరితిత్తులు, కాలేయం, గొంతు క్యాన్సర్ వచ్చే అవకాశం తగ్గుతుంది. గుండె సంబంధిత వ్యాధులు తగ్గుతాయి. రక్తదానం చేయగా.. దానిని భర్తీ చేసేందుకు కేవలం నాలుగు రోజుల సమయం మాత్రమే పడుతుంది. ఆ సమయంలో దాత రక్త వ్యవస్థలో గణనీయమైన వృద్ధి ఉంటుంది. అందుకే రక్తదానంపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. జిల్లా జనాభా సుమారు 29 లక్షల మంది ఉండగా.. ఒక్క శాతం మంది రక్తదానం చేసినా కొరతను అధిగమించవచ్చని స్పష్టం చేస్తున్నారు.

పోర్టు కళింగపట్నంలో భారీ చోరీ

(ఐదో పేజీ తరువాయి)

తెలియజేసింది. ఆయన వచ్చి చూడగా బంగారు ఆభరణాలు పోయినట్టు గుర్తించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. గార ఎస్ఐ గంగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఏయే వస్తువులు, నగదు పోయాయో ఆరా తీశారు. తన ఇంటి నిర్మాణం కోసం దాచుకున్న రూ.లక్ష నగదు, 40 తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్టు పద్మావతి తెలిపారు. అలాగే తన తల్లి ఇంట్లో 15 తులాల బంగారం, దీపక్ ఇంట్లో మరో 4 తులాల బంగారం చోరీకి గురైందని శంకర్‌దాస్ వివరించారు.

- శ్రీకాకుళం నుంచి క్లూస్‌టీమ్ వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించింది. పరిసర ప్రాంతాలను పరిశీలించి.. వేలిముద్రలు సేకరించింది. ఏ వైపు నుంచి దుండగులు చొరబడ్డారనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతానికి సేకరించిన వివరాలు గోప్యంగా ఉంచారు. కాగా.. ప్రధాన రహదారిలోని మూడు ఇళ్లలో ఒకేసారి పెద్దఎత్తున చోరీ జరగడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి ఘటనలు జరగలేదని పేర్కొంటున్నారు.

మత్తు పదార్థాల వినియోగంపై ఉక్కుపాదం

(ఐదో పేజీ తరువాయి)

చేయాల'ని సూచించారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ 'గంజాయి అరికట్టడంలో కేసుల పెట్టడమే లక్ష్యం కాదు. ఒకే వ్యక్తి పదేపదే గంజాయి వాడుతున్నాడంటే నిఘా లోపం ఉన్నట్లే. చిన్నపాటి సమాచారం ఉన్నా సరే పోలీసులకు అందజేయాల'ని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్ కుమార్, పోలీసు, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, విద్య, వైద్యారోగ్యశాఖ, ఇంజినీరింగ్, రవాణా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఒక్కరోజే

(ఐదో పేజీ తరువాయి)

ఈక్రాప్ నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. సోమవారం నాటికి 2.51లక్షల ఎకరాల్లో(51శాతం) ఈ-క్రాప్ నమోదైంది. మంగళవారంతో ఈ-క్రాప్ నమోదుకు గడువు ముగియనుంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల తహసీల్దార్లు, ఏవోలు సమావేశం నిర్వహించి ఈక్రాప్ నమోదు వేగవంతం చేయాలని సిబ్బందికి ఆదేశించారు. కాగా సాంకేతిక సమస్యల కారణంగా నమోదు ప్రక్రియ జాప్యమవుతోంది. క్షేత్రస్థాయిలో ఇబ్బందుల దృష్ట్యా ఈ-క్రాప్ నమోదుకు గడువు పెంచాలని ఉన్నతాధికారులను కోరినట్టు జిల్లా వ్యవసాయ అధికారి త్రినాథస్వామి తెలిపారు.

మురిపించిన దసరా పాటలు

కోటబొమ్మాళి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు దసరా పాటలతో గ్రామస్థులను అలరించారు. వివిధ దేవత వేషధారణలో గ్రామాల్లో తిరుగుతూ పాడిన దసరా పాటలు ఆకట్టుకున్నాయి. సోమవారం పాఠశాలలో సరస్వతీ పూజ చేశారు. అనంతరం నేటి కాలంలోని ఆధునిక తను దసరా పాటలకు జోడిస్తూ సామాజిక చైతన్యం కలిగించేలా సీతమ్మ వాకిట్లో సిరిమల్లె, మాయమైపోయాడు మన గాంధీతాత, భాగోత లాట, సారాయి తాగొద్దు ఖైనీలు వద్దు అంటూ వీధు లలో బాణాలు పట్టుకొని తిరిగారు. చిన్నారులను మెచ్చి గ్రామస్థులు ఇచ్చిన కానుకలతో తాము క్రీడా సామగ్రి కొంటామని విద్యార్థి నాయకులు సుగుణ, జ్ఞానేశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు షణ్ముఖరావు, తిరుపతి రావు, గోవిందరావు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


దసరా పాటలు పాడుతున్న విద్యార్థులు

రైతులకు ఇబ్బంది లేకుండా చూడండి

- నానో ఎరువుల ప్రయోజనాలు తెలియజేయండి
- అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం

కోటబొమ్మాళి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రానున్న రోజుల్లో సాంకేతికతను వినియోగించుకుని ఎరువుల పంపిణీకి అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. స్థానిక ఎన్టీఆర్ భవనంలో సోమవారం వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో ఆధార్ అనుసంధానం చేసి రైతులకు ఎరువులు పంపిణీ చేయడానికి గల సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని సూచించారు. ఒక్క రైతు కూడా ఇబ్బందులు పడకుండా ఎరువులు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. గతం కంటే లక్ష మెట్రిక్ టన్నుల ఎరువులు అదనంగా మంజూరు చేసినట్టు చెప్పారు. సమగ్ర ప్రణాళికతో పంపిణీ చేయాలని సూచించారు. ప్రధానంగా నానో ఎరువుల ఆవశ్యకత, వాటి ప్రయోజనాలపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రైతులంతా ఈ పంట నమోదు చేసుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. శాస్త్రవేత్తల సూచనలు పాటించి అవసరమైన మేరకు ఎరువులు, పురుగు మందులు వాడే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జేడీ త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

జాతీయస్థాయిలో సిక్కోలు క్రీడాకారుల ప్రతిభ


జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ సాధించిన జిల్లా క్రీడాకారులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలో ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు జరిగిన 71వ సీనియర్, సబ్ జూనియర్ జాతీయస్థాయి బాల్ బాడ్మింటన్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు రాష్ట్రం నుంచి ప్రతిభ కనబరిచారు. సబ్‌జూనియర్స్ విభాగంలో బాలురు జట్టు ద్వితీయస్థానం కైవసం చేసుకుంది. సీనియర్స్ విభాగంలో మహిళా జట్టు తృతీయస్థానం సాధించింది. ఈ పోటీల్లో మన జిల్లా వాసులు ప్రధాన భూమిక పోషించారు. సబ్ జూనియర్ విభాగంలో ఎన్. ప్రవీణ్ కుమార్ (ఎచ్చెర్ల), టి.అఖిల్ (నరసన్నపేట), బి.జ్యోత్స్న (సానివాడ), సీహెచ్ శ్రావణి (సానివాడ) పాల్గొన్నారు. సీనియర్ మహిళా విభాగంలో ఎం.గాయత్రి (ఎచ్చెర్ల) పాల్గొని ప్రతిభ కనబరిచి జిల్లా కీర్తిని ఇనుమడింపజేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులను సంఘం చైర్మన్ సూర శ్రీనివాసరావు, అధ్యక్షుడు కోత పూర్ణచంద్రరావు, ప్రధాన కార్యదర్శి పీవీజీ కృష్ణంరాజు తదితరులు అభినందించారు.

ఇచ్ఛాపురం, నరసన్నపేటలో కుండపోత


ఇచ్ఛాపురంలో వర్షపు నీటిలో వాహనదారుల ఇక్కట్లు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలో సోమవారం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండతో ఉక్కపోతకు గురైన ప్రజలు ఒక్కసారి భారీ వర్షం పడడంతో కొంత ఉపశమనం పొందారు. భారీవర్షానికి రోడ్లపై నీరు నిలిచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్వేచ్ఛావతి అమ్మవారి వీధిలో రోడ్లపై వర్షం నీరు ప్రవహించింది.

నరసన్నపేటలోనూ..

నరసన్నపేట, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): నరసన్నపేటతోపాటు పరిసర గ్రామాల్లో సోమవారం సాయంత్రం కుండ పోత వర్షం కురిసింది. ఏకధాటిగా సుమారు రెండు గంటల పాటు ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. పిడుగులు పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. గ్రామాల్లో భారీ వర్షాలకు వరదనీరు తంపర భూముల్లోకి చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరి స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


నరసన్నపేట: లక్ష్మీనగర్‌లో నిలిచిన వర్షపు నీరు

మెరుపుల 'షో'యగం

అరసవల్లి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉదయమంతా వేడి వాతావరణం ఉండగా సాయంత్రం ఒక్కసారి మార్పు వచ్చి నల్లని మబ్బులు కమ్మి నగరం చీకటిగా మారింది. చిరు గాలులు, చిరుజల్లులు కురిసి చల్లదనమైంది. ఆకాశంలో ఉరుములు, మెరుపులు ఏర్పడి నగరం వెలుగు జిలుగులు విరజిమ్మింది.



న్యూస్ బాక్స్

6 నుంచి వీడియో, ఫొటోగ్రఫీలో శిక్షణ

ఎచ్చెర్ల, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో వీడియో, ఫొటోగ్రఫీ, సెల్‌ఫోన్ సర్వీసింగ్‌లో అక్టోబరు 6వ తేదీ నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు సంస్థ డైరెక్టర్ ఎన్.రాంజీ తెలిపారు. 30 రోజుల పాటు నిర్వహించనున్న ఈ శిక్షణలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఫొటో ఎడిటింగ్, వీడియో మిక్సింగ్, ఆల్బమ్ క్రియేషన్, డ్రోన్ ఆపరేటింగ్‌లో తర్ఫీదు ఇస్తామన్నారు. పదో తరగతి చదివిన 19-45 ఏళ్లలోపు యువకులు ఈ శిక్షణకు అర్హులన్నారు. ఆసక్తి గలవారు 95534 10809, 77021 80537 నెంబర్లలో సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి


రక్తదానం చేస్తున్న యువకులు

గార, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ జన్మదినోత్సవాల్లో భాగంగా సోమవారం కె.మత్స్యలేశంలో బీజేపీ మండల అధ్యక్షురాలు మైలిపిల్లి లక్ష్మీజనార్దన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య, రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్.తేజేశ్వరరావు మాట్లాడుతూ.. వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని కోరారు. పలువురు రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పైడి సింధూర, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలరావు, నేతలు ఎస్.ఉమామహేశ్వరి, పండి యోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికీ తగ్గిన జీఎస్టీ రేట్ల వివరాలు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): తగ్గిన జీఎస్టీ రేట్లకు సంబంధించిన వివరాలతో కరపత్రాలను జిల్లాలో ప్రతీ ఇంటికీ పంపిణీ చేస్తామని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో సోమవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి వర్గాలకు ఎన్డీఏ ప్రభుత్వం ఇచ్చిన గొప్ప బహుమతి అని, దీని ఫలాలు అందరికీ చేరాలన్నారు. జీఎస్టీ తగ్గింపులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ స్వప్నదేవి, అసిస్టెంట్ కమిషనర్లు ఏఎస్‌వీప్రసాద్, వి.చంద్రకళ, వేణుగోపాల్, ఎం.శ్రీనివాసరావు, జె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై గోతులు పూడ్చండి

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని పలు మార్గాల్లో ఏర్పడిన గోతులను పూడ్చి ప్రమాదాలను అరికట్టాలని వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి కోరారు. మునిసిపల్ కౌన్సిల్ హాల్లో సోమవారం చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. రోజూ ప్రమాదాలు జరుగుతున్నా మీకు కనిపించడం లేదా అని స్వర్ణమణి అధికారులను ప్రశ్నించారు. అజెండాలోని అంశాలను ఆమోదించారు. సమావేశంలో కమిషనర్ ఎన్.రమేష్, వైస్ చైర్‌పర్సన్ భారతి దివ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పారిశుధ్య కార్మికులకు సోమవారం బస్టాండ్ జంక్షన్ సమీపంలోని లైబ్రరీ వద్ద 'స్వచ్ఛతా హీ సేవా'లో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కమిషనర్ ఎన్.రమేష్ ఆధ్వర్యంలో వైద్యాధికారి అఖిల్ మనోహర్ కార్మికులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ పరీక్షల విజేతలు

సోంపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): లక్కవరంలో సరస్వతీ పూజల్లో భాగంగా సోమవారం జిల్లాస్థాయి టాలెంట్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షకు 216 మంది పాల్గొనగా హరిపురానికి చెందిన ఎం.యశ్వత్ మొదటి, గొల్లవూరుకు చెందిన వంకల శ్రీవిద్య రెండవ, లోహరి బందకి చెందిన తెప్ప వికాస్ మూడో స్థానంలో నిలిచారు. నిర్వాహకులు సీహెచ్ శ్రీనివాసరావు, ఈశ్వరరావు, మాగుపల్లి అప్పన్న, బైపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం దృష్టికి కిడ్నీవ్యాధి సమస్య

పొందూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కృష్ణాపురం కిడ్నీవ్యాధి సమస్యను డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకు వెళ్లనున్నట్లు పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ అన్నారు. గ్రామంలో కిడ్నీ వ్యాదితో ఆదివారం మృతిచెందిన గార వెంకటమ్మ, ఇటీవల కిడ్నీవ్యాధితో మృతి చెందిన చిత్తిరి సూర్యనారాయణ కుటుంబాలను సోమవారం పరామర్శించారు. కృష్ణాపురం (గారపేట)లో రెండేళ్లలో సుమారు 25 మంది కిడ్నీ వ్యాధితో మృతిచెందారని బాధితులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు కొంచాడ చిన్నంనాయుడు, గార బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ బాగు చేశారు


పైపులైన్‌ను బాగు చేసి లీకును అరికట్టిన దృశ్యం

గార రూరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పోర్టు కళింగపట్నం పంచాయతీ ప్రజలకు తాగునీరందించే పైపులైన్‌ను బాగు చేశారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'వృథాగా తాగునీరు' శీర్షికతో వచ్చిన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. పైప్‌లైన్ లీకును అరికట్టడంతో గ్రామానికి సక్రమంగా నీటి సరఫరా అయింది. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తంచేశారు.

ప్రజా ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

● ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను తక్షణం విచారణ చేసి పూర్తిస్థాయిలో పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహించవద్దని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 44 మంది నుంచి వినతులు స్వీకరించి వారితో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదుదారు సంతృప్తి చెందేలా చర్యలు చేపట్టాలన్నారు. వృద్ధులు, దివ్యాంగులతో మాట్లాడి భరోసా కల్పించారు. మొత్తం 44 ఫిర్యాదులు రాగా వాటిలో కుటుంబ సమస్యలు, తగాదాలు, మోసపూరితమైనవి, ఆస్తి తగాదాలు, సివిల్, ఇతర అంశాలపై వినతులు వచ్చినట్లు డీపీవో కార్యాలయ వర్గాలు తెలిపాయి.

కాలనీల ముంపు సమస్యను పరిష్కరించండి


ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న సీపీఎం నేతలు

అరసవల్లి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలోని పలు కాలనీల్లో ముంపు సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, తక్షణం పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, పట్టణ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఎం.గోవర్ధనరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డీసీసీబీ కాలనీ, జగన్నాథనగర్, గోవిందనగర్, రామ్‌నగర్, ఇందిరానగర్, జగ్గయ్య కాలనీ, వంశధార కాలనీ, తిలక్‌నగర్ కాలనీ, కొన్నావీధి తదితర ముంపు కాలనీల్లో పర్యటించి సమస్యలను గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏమాత్రం వర్షం పడినా కాలనీల్లో నీరు బయటకు వెళ్లక నిలువ ఉండిపోతోందని, ఖాళీ ప్రదేశాలు మురికి కూపాల్లా తయారవుతుండడంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రమంత్రి, ఎమ్మెల్యేలున్నా ఈ సమస్యకు పరిష్కారం చూపకపోవడం దారుణమన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు కె.మోహనరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, కె.సూరయ్య, ఎస్.అప్పన్న, కె.అప్పారావు, ఎం.ఆదినారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పని ఒత్తిడి తగ్గించాలని నిరసన


కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సచివాలయ సిబ్బంది

శ్రీకాకుళం అర్బన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పని ఒత్తిడి తగ్గించి జీతాలు తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని నగరంలోని సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీలు, సిబ్బంది డిమాండ్ చేశారు. ఈ మేరకు నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వలంటీర్లను తొలగించారని, వారి పని కూడా తామే చేస్తున్నామని, విధులు ముగించుకొని ఇంటికి వెళ్లిన తరువాత కూడా రాత్రి పూట ఇంటిలో కార్యాలయ పనుల చేయాల్సి వస్తోందని, దీంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామన్నారు. దసరా పండగ పూట కూడా జీతాలు చెల్లించకపోతే ఎలా అని ప్రశ్నించారు. డోర్ టు డోర్ సర్వేలు వద్దని, మా ఆత్మగౌరవం మాకు ముద్దు అని, ఇన్‌చార్జి డ్యూటీల భారం నుంచి మినహాయించాలని నినాదాలు చేశారు. అనంతరం టౌన్‌ప్లానింగ్ ఏసీపీ జానకిని కలిసి వినతిపత్రం అందించారు.

బారువవాసికి అథ్లెటిక్స్‌లో కాంస్యం


కాంస్య పతకం సాధించిన కృష్ణ

సోంపేట, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): బారువ గ్రామానికి చెందిన బి.కృష్ణ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో కాంస్య పతకం సాధించాడు. గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో ఈనెల 26, 27, 28 తేదీల్లో నిర్వహించిన చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్-20 విభాగంలో హేమర్ త్రో అంశంలో తృతీయస్థానం సాధించాడు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్థులు, స్నేహితులు అభినందించారు.

పోటీ పరీక్షల పుస్తకాలు అందజేత

లావేరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయానికి పూర్వ పాఠకుడు కొమ్మాన దీపక్ సోమవారం వివిధ రకాల పోటీ పరీక్షల పుస్తకాలను అందించారు. రూ.2 వేలు విలువైన పుస్తకాలను గ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావుకు అందజేశారు.

వీధి వ్యాపారులకు రుణమేళా

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రుణాలు పొందని అర్హులైన వీధి విక్రయదారులకు, చిరు వ్యాపారులకు రుణ సౌకర్యాన్ని కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్నాయని మెప్మా ఐబీ రాము అన్నారు. సోమవారం వీపీసీఎస్ కార్యాలయం ఆవరణలో పీఎం స్వనిధి 2.0 లోక్ కల్యాణ్ మేళాపై చిరు వ్యాపారులకు అవగాహన కల్పించారు. డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ అనిత పండా, భాస్కరరావు, మోహన్‌రావు పాల్గొన్నారు.

బెర్మ్‌లు కొట్టుకుపోయి.. రోడ్డు కుంగిపోయి

● భయాందోళన చెందుతున్న వాహనచోదకులు ● ఇదీ జంక్షన్ నుంచి సింగూరు రోడ్డు దుస్థితి

పొందూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగూరు జంక్షన్ నుంచి సింగూరు గ్రామానికి వెళ్లే రోడ్డులో బెర్మ్‌లు కొట్టుకుపోవడంతోపాటు రోడ్డు కుంగడంతో వాహన చోదకులు, ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. గత ఏడాది రెల్లిగెడ్డకు భారీ వరదలు వచ్చిన సమయంలో బెర్మ్‌లు కొట్టుకుపో వడంతో తర్వాత మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో రోడ్డు రానురాను కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. నాలుగేళ్ల కిందట పంచాయతీరాజ్ అధికారులు పక్కారోడ్డు వేశారు. ఇక్కడ రెల్లిగెడ్డ వరద పోటు వల్ల రక్షణ గోడ నిర్మించాల్సిఉంది. అయితే గత ఏడాది వరదలకు రోడ్డు కొట్టుకుపోగా తర్వాత వాహనాల రాకపోకల ఒత్తిడి వల్ల క్రమేణా కుండిపోయి రోడ్డులో సగభాగం దెబ్బతింది. దీంతో సింగురు నుంచి శ్రీకాకుళం వైపు వెళ్లే వాహనచోదకులు, ప్రయాణికులు ఏ పాటి ఏమరపాటునా ఉన్నా ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశముందన్న ఆందోళన నెలకొంది. బెర్మ్‌లు కొట్టుకుపోయి ఏడాది కావస్తున్నా కనీస మరమ్మతులకు అధికారులు,ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోక పోవడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.


సింగూరు వద్ద రోడ్డు కోతకు గురైన దృశ్యం

నీరందక.. మంటలు ఆర్పలేక

●మొరాయించిన అగ్నిమాపక వాహనం
●పాలకొండ నుంచి శకటం వచ్చినా ఫలితం లేని వైనం
● రూ.70 లక్షల ఆస్తి నష్టం ●కొత్తూరులో హార్డ్‌వేర్ షాపు దగ్ధం


కొత్తూరులో దగ్ధమవుతున్న హార్డ్‌వేర్ దుకాణం

కొత్తూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కొత్తూరులోని బత్తిలి రహదారిలోని కమలహార్డ్‌వేర్ అండ్ ప్లేఉడ్ షాపులో ఆదివారం అర్ధరాత్రి మంటలు చెలరేగి కాలి బూడిదయ్యింది. ఈప్రమాదంలో సుమారు రూ.70 లక్షల ఆస్తి నష్టంజరిగిందని షాపుయజమాని వజ్రం తెలియజేశారని పాలకొండ అగ్ని మాపక కేంద్రం అధికారి జామి విశ్వేశ్వరరావు తెలిపారు. నీరు అందుబాటు లో లేకపోవడంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసు కురాలేకపోయారు. స్థానికులు, అగ్నిమాపకఅధికారుల కథనం మేరకు.. షాపు యజమాని ఆదివారం రాత్రి తొమ్మిది గంటలకు మూసివేసి నవరాత్రుల ఉత్సవానికి బంధువుల ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో షాపు నుంచి మంటలు రావడంతో షాపు యజమానికి కొందరు సమాచారం అందించారు. అదేసమయంలో కూతవేట దూరంలో ఉన్న అగ్ని మాపక కేంద్రానికి సమాచారం ఇచ్చిన సకాలంలో స్పందించి శకటంచేరుకో లేదు. తర్వాత అక్కడకుచేరుకున్నా వాహనంలో నీరులేదు. దీంతో నీటికోసం చెరువు వద్దకు వెళ్లన తర్వాత అగ్నిమాపక వాహనం మొరాయించింది. విధిలేని పరిస్థితిలో పాలకొండ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చా రు.పాలకొండ నుంచి అగ్నిమాపకశకటం చేరుకునే సరికి మూడు గంటలు పట్టడంతో షాపు మొత్తం దగ్ధమయింది. ప్రమాద స్థలానికి 100 మీటర్లు దూరంలో ఉన్న అగ్నిమాపక వాహనం సకాలంలో చేరుకోకపోవడం వల్ల తామంతా చూస్తుండగా షాపు దగ్ధమయ్యిందని పలువురు వాపోయారు. షాపులో ప్లేఉడ్, పెయింట్ ఇతర సామగ్రిఉండడంవల్ల మంటలు ఎగసిపడ డంతోచుట్టుపక్కల షాపులు యజమానులు భయాందోళనకు గురయ్యారు. రాజస్థాన్ నుంచి వలసవచ్చి వ్యాపారం ప్రారంభించి వ్యాపారం సజావుగా సాగుతున్నతరుణంలో అగ్ని ప్రమాద రూపంలో నష్టంజరగడంతో కుటుం బ సభ్యులు లబోదిబోమంటున్నారు. షార్ట్ సర్క్యూట్ వల్ల లేకపోతే మరే ఇతరకారణాల వల్ల ప్రమాదం జరిగిందోనని విషయం తెలియాల్సిఉంది.

25.260 కిలోల గంజాయి స్వాధీనం

పలాస, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పలాసలో రెండు వేర్వేరు కేసుల్లో 25.260 కిలోల గంజాయిని సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ కథనం మేరకు.. ఒడిశాలోని పర్లాకిమిడికి చెందిన సర్వాసుద్ధి కుమారస్వామి ఆర్.ఉదయగిరికి చెందిన కాళిదాస్‌ప్రధాన్ నుంచి గంజాయి కొనుగోలుచేసి కోల్‌కతాకు చెందిన రాజాదాస్‌కు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ క్రమంలో 10.155 కిలోల గంజాయిని బ్యాగులో వేసుకొని పలాస రైల్వేస్టేషన్ రోడ్డు మీదుగా స్టేషన్‌కు వెళ్తున్న సమయంలో తనిఖీలు నిర్వహిస్తున్న పట్టుబడ్డాడు. దీంతో కుమారస్వామిని అరెస్టు చేశారు. మిగిలిన ఇద్దరు నిందితుల కోసం గాలిస్తున్నారు.అలాగే ఆర్.ఉదయగిరికి చెందిన అమిత్‌ప్రధాన్ గంజాయి పండిస్తున్నాడు. బ్రోకర్ల ద్వారా రవాణా చేస్తుంటాడు. ఈ క్రమంలో బెంగళూరుకు చెందిన హేమాబేగమ్‌కు గంజాయి ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకున్నాడు.ఇందులో భాగంగా ఆర్.ఉదయగిరికు చెందిన రాజేష్‌బిరా 15.105కిలోల గంజాయి కొనుగోలుచేసి పలాస రైల్వేస్టేషన్‌కు చేరుతున్న క్రమంలో పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేయగా ఒకర్ని అరెస్టు చేయగా, మిగిలిన వారిపై కేసు నమోదుచేశారు.

డచ్ బంగ్లా వద్ద రెండు కేజీలు..

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): గంజాయితో పట్టుబడిన వ్యక్తిపై సోమవారం కేసునమోదు చేసినట్లు ఒకటో పట్టణ ఎస్ఐ హరికృష్ణ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. నగరంలోని మంగువారితోట కంద్రవీధికి చెందిన బొమ్మలాడ హరికృష్ణ కలెక్టరేట్ సమీపంలోని డచ్ బంగ్లా వద్ద చేతి సంచితో తిరుగుతుండడంతో విచారించగా రెండు కేజీల గంజాయి లభించిందన్నారు. ఒడిశాలో గంజాయిని కొనుగోలుచేసి హరికృష్ణ నగరంలో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఈమేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించగా ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి రిమాండ్ విధించినట్టు ఎస్ఐ తెలిపారు.

కొట్లాట కేసులో నలుగురి అరెస్టు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఈదుపురంలో జూన్‌లో ఇరు వర్గాల మధ్య జరిగిన కొట్లాట కేసులో ఏడుగురు నిందితుల్లో నలుగురిని అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఇచ్ఛాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొట్లాట కేసులో ఒక వర్గానికి చెందిన వ్యక్తి తల పగలగొట్టి నిందితులు పరారు కాగా మర్డర్ కేసు నమోదుచేశామన్నారు. అప్పటి నుంచి గాలింపు చర్యలు చేపట్టగా సోమవారం దాసరినాగరాజు, మద్దిలి జగన్నాథ్, దాసరి రాజయ్య, మద్దిలి నవీన్‌లను అరెస్ట్ చేశామన్నారు.నర్తురాజాతోపాటు తలగాన ఆనంద్, నర్తు సత్యం కోసం గాలిస్తున్నామని చెప్పారు. అరెస్టయిన నలుగురిని అంపోలు జైలుకి తరలించామని తెలిపారు.

చోరీ కేసులో ముగ్గురు మహిళలు..

లావేరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బుడుమూరు సంత జంక్షన్‌లోని బంగారం దుకాణంలో ఈనెల 26న జరిగిన చోరీ కేసులో ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ జి.లక్ష్మణరావు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. ఈనెల 26న బంగారం దుకాణంలో మూడు జతల వెండి పట్టీలు, నాలుగు బంగారు ముక్కు పుడకలను దొంగతనం చేశారు. దుకాణ యజమాని కలిశెట్టి కృష్ణ ఫిర్యాదుమేరకు సీసీ ఫుటేజీ ఆధారంగా దొంగతనానికి పాల్పడిన ముగ్గురు మహిళలను సోమవారం అరెస్ట్ చేసి వారి నుంచి సదరు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. దొంగతనానికి పాల్పడిన ముగ్గురు మహిళలపై గతంలో విశాఖసిటీ పరిధిలోని ద్వారకానగర్, ఎంవీపీకాలనీ, ఎయిర్ పోర్టు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్లు ఎస్ఐ తెలిపారు. విశాఖపట్నంలోని అల్లిపురానికి చెందిన తాల లక్ష్మి, జగ్గు రోతు సూరీడు, చేబ్రోలు అప్పలనర్సమ్మగా గుర్తించారు నిందితులను సోమవారం అరెస్ట్‌చేసి, శ్రీకాకుళం కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. చోరీ జరిగిన 48 గంటల్లో నిందితులను పట్టుకున్న పోలీసు సిబ్బందికి దుకాణ యజమాని కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

బిల్లులు చెల్లించకపోవడంపై నిలదీత

పలాస, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి):తన వార్డులో కాలువ నిర్మించి మూడేళ్లవుతున్నా కాంట్రాక్టర్లకు బిల్లులు ఎందుకు చెల్లించడం లేదని, ఈ విధంగా అధికారులు తీరు ఉంటే పనులు ఎవరు చేయడానికి ముందుకు వస్తారని 30వార్డు టీడీపీ కౌన్సిలర్ డొక్కరి తులసీ అధికారులను నిలదీశారు. సోమవారం చైర్మన్ బళ్ల గిరిబాబు అధ్యక్షతన పలాస-కాశీబుగ్గ మునిసిపల్ పాలకమండలి సమావేశం జరిగింది. ఈసందర్భంగా 26వ వార్డు టీడీపీకౌన్సిలర్ తంగుడు ఆశారాణిమాట్లాడుతూ తనవార్డులో కామాక్షమ్మ ఆలయంవద్ద కల్వర్టు పాడయ్యిందని ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు.నాలుగేళ్లుగా తన వార్డులో ఎటువంటి అభివృద్ధి చేయలేదని, అటువంటప్పుడు తాను సమావేశాలకు వచ్చి ఏం లాభమని సభ నుంచి ఆమె వాకౌట్ చేశారు. సమావేశంలో వైస్‌చైర్మన్ మీసాల సురేష్‌బాబు, కౌన్సిలర్లు దువ్వాడ శ్రీకాంత్, గురిటి సూర్యనారాయణ, సవర సోమేశ్వరరావు, జోగ త్రివేణి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

● వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు


అర్జీని పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా అధికారులు పని చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.సోమవారం కోటబొమ్మాళిలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు వినతులు అందజేశారు. అర్జీలను పరిశీలించి గ్రీవెన్స్‌కు హాజరైన రెవెన్యూ, ఇరిగేషన్ రహదారులు, పంచాయతీ, విద్యుత్ అధికారాలకు అక్కడికక్కడే సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే కోటబొమ్మాళి ప్రభుత్వాసుపత్రిలో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న డి.కోటి ఇటీవల మృతిచెందడంతో ఆయన భార్య రత్నంకు రూ.50వేలు అందజేశారు.కాగా కోటబొమ్మాళి ఏఎంసీ యార్డులో ఏఎంసీ పాలక మండలి ప్రమాణ స్వీకారం జరిగింది.చైర్మన్‌గా బగాది శేషగిరిరావు, ఉపాధ్యక్షులుగా బాడాన వెంకటరమణమ్మ, సభ్యులుగా కర్రి రామిరెడ్డి, కవిటి ధర్మారావు, తాడి సింహాద్రినాయుడు, జర్జాన రాంజీ సూరాడ ధనరాజు, నడిపించి నాగరాజు, లండ సుజాత, పల్లి సునీత, దేవాది పద్మావతి, గౌరీ, హేమసుందరరావు, అప్పలస్వామి, భీమారావు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమాల్లో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, కొత్తమ్మతల్లి ఆలయ చైర్మన్ కోరాడ గోవిందరావు, ఏఎంసీ కార్యదర్శి కె.రామారావు, పర్యవేక్షకులు టి.హేమలత, కె. మురళీకృష్ణ, ఎం.నాగమణి, నాయకులు కల్లి నాగయ్యరెడ్డి, శివకుమార్, కర్రి అప్పారావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ పొన్నాడ గణేష్ పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంతోనే సమాజాభివృద్ధి

●నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


మాట్లాడుతున్న బగ్గు రమణమూర్తి

జలుమూరు (సారవకోట) సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంపైనే సమాజాభివృద్ధి ఆధారపడి ఉంటుందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. సోమవారం సారవకోట మండలంలోని బుడితి సామాజిక ఆసుపత్రిలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం ఉచిత ఆరోగ్య వైద్యశిబిరాలు నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.శంకరరావు, వైద్యాధికారులు, సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

భక్తులకు సౌకర్యాలు మెరుగుపరచాలి

● పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


ఎంజీఆర్‌కు వినతిపత్రంఇస్తున్న బీటీఏ నాయకులు

పాతపట్నం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): నీలమణి దుర్గ ఆలయ అభివృద్ధికి కృషిచేయడంతో పాటు భక్తులకు సౌకర్యాలు మెరుగుపరచాలని శాసనసభ ప్రివిలేజ్ కమిటీ సభ్యుడు, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. సోమవారం స్థానిక క్యాంపుకార్యాలయంలో నీలమణి దుర్గ ఆలయ అధ్యక్షుడు అక్కంద్ర సన్యాసిరావుతోపాటు పాలకమండలి సభ్యులు ఎంజీఆర్‌ను కలిశారు. అలాగేఅసెంబ్లీ సమావేశాల్లో పాతపట్నం, కొత్తూరు కోర్టుభవనాల కోసం ప్రస్తావించడంతో ఆయాకోర్టుల బార్‌అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేను అభినందించారు. కాగా పాతపట్నం కళింగవైశ్యసంఘ అధ్యక్షుడిగా ఎన్నికైన కలివరపు మధును ఎమ్మెల్యేగోవిందరావు అభినందించారు. సంఘ గౌరవాధ్యక్షుడు శాసనపురి మహేశ్వరరావు, యెరుకోల కృష్ణారావు,మధుబాబు, దేవరశెట్టి వెంకటరమణ, రాజు, కోరాడ మురళి తదితర కళింగవైశ్య సంఘనాయకులు ఎమ్మెల్యేను కలిశారు.

●ఎల్.ఎన్.పేట, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి):పాతపట్నంలోని క్యాంపు కార్యాలయంలో బీటీఏ జిల్లా అధ్యక్షుడు ఎస్.రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమస్యలపై ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు వినతిపత్రం అందజేశారు.

జానపద కళల అభివృద్ధికి కృషి


కుమార్‌నాయక్‌ను సన్మానిస్తున్న సంఘాల నాయకులు

హరిపురం, సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి): జానపద కళాకారుడు, న్యాయనిర్ణేత, సినీనటుడు డాక్టర్ కుమార్ నాయక్ కళారంగానికి చేసిన సేవలు శ్లాఘనీయమని భవాని మోటార్ యూనియన్‌అధ్యక్షుడు రాజమండ్రి రాజారావు తెలిపారు.సోమవారం మందసమండలంలోని అంబుగాంలో కుమార్‌నాయక్, ఢీకొరియోగ్రాఫర్ గురు, వెస్ట్రన్‌కొరియోగ్రాఫర్ రిషేకేష్‌కు సన్మానించారు.ఈసందర్భంగావక్తలు మాట్లాడుతూ ఉద్దానం, గిరిజన ప్రాంతాల్లో జానపద కళల అభివృద్ధి కోసం కుమార్ నాయక్ కృషి చేస్తున్నారని కొనియాడారు.కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు మురళీచౌదరి, భవన నిర్మాణకార్మిక సంఘం అధ్యక్షుడు బల్ల మాధవరావు, మజ్జి భాస్కరరావు, హేమరాజు, రెల్ల జగదీష్, మజ్జి వైకంఠరావు, బత్తిని తారకేశ్వరరావు పాల్గొన్నారు.

2న అన్నాభిషేకం


మందిరంలో షిర్డీసాయిబాబా మూలవిరాట్

పలాస, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక శివాజీనగర్ బాబా సంస్థాన్ మందిరంలో అక్టోబరు రెండోతేదీన షిర్డీ సాయిబాబా మహాసమాధి చెందిన రోజును పురస్కరించుకొని అన్నాభిషేకం నిర్వహించనున్నట్లు మందిర కన్వీనర్, ట్రస్టీ దువ్వాడ శ్రీధర్(బాబా) ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటల నుంచి ఆలయ ప్రధాన అర్చకుడు ధర్మపురం వాయునందనశర్మ ఆధ్వర్యంలో జరిగేకార్యక్రమంలో అన్నాభిషేకం అనంతరం అన్నప్రసాద వితరణ జరుగుతుందని పేర్కొన్నారు. 24 గంటల పాటు ఓంసాయి శ్రీసాయి జయజయ సాయి అనే ఏకనామ సంకీర్తనతో ఏకాహం జరుగుతుందని తెలిపారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

టెక్కలి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్కిల్ హబ్ కేంద్రంలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఆపైన చదువుకొని ఆసక్తి కలిగినవారు అక్టోబరు ఎనిమిదో తేదీలోగా దరఖాస్తులను స్కిల్‌హబ్ కేంద్రంలో అందజేయాలని కోరారు.

పీహెచ్‌సీల్లో వైద్యుల నిరసన

పాతపట్నం/రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గంగువాడ, బైదలాపురం పీహెచ్‌సీల్లో సోమవారం వైద్యులు శివకుమార్, పూర్ణిమ, సత్యవాణి నిరసన తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇన్ సర్వీస్ పీజీ కోటా పునరుద్ధరించాలని, పదోన్నతులు కల్పించాలని, అలవెన్స్‌లు, ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని పీహెచ్‌సీల్లో సోమవారం నుంచి ఓపీ సేవలు నిలిపివేస్తామని వైద్యుల సంఘం ప్రకటించిన విషయం విదితమే.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ఎల్.ఎన్.పేట, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే శారీరక ఆరోగ్యం లభిస్తుందని తురకపేట పీహెచ్‌సీ వైద్యాధికారులు బి.వసుధ, డి. పాపారావు తెలిపారు. ముంగెన్నపాడులో సోమవారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు.కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ కె.జ్యోతి, పీఏసీఎస్ డైరెక్టర్ వై. రాంబాబు పాల్గొన్నారు.

గ్రానైట్ క్వారీలకు అనుమతులు ఇవ్వవద్దు

మెళియాపుట్టి,సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి):సుర్జిణి పరిసర ప్రాంతంలో కొత్త గ్రానైట్‌క్వారీలకు అనుమతులు ఇవ్వద్దని సర్పంచ్ బి.చంద్రరావుతోపాటుగ్రామస్థులు రామారావు, కరుణకరరావు, మేనకేశ్వరావు కోరారు. సోమవారం కలె క్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ తీర్మానం లేకుండా పనులు చేయడానికి సిద్ధమవుతున్నారని తెలిపారు.

యూరియా కోసం అగచాట్లు

పలాసరూరల్,సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గలోని గ్రోమోర్ కేంద్రం వద్ద సోమవారం రైతులు యూరియా కోసం అగచాట్లకు గురయ్యారు. టోకెన్ ఉన్నాఅధికసంఖ్యలో రైతులు గుమిగూడడంతో గంటల కొద్దీ యూరియా కోసం వేచిచూడక తప్పలేదని పలువురు వాపోతున్నారు.మునిసిపాలిటీతోపాటు బొడ్డపాడు,గురుదాసుపురంగ్రామాల రైతులకు ఒక్కసారిగా యూరియా పంపిణీవల్ల గందరగోళం నెలకొంది.

యూరియా అందించాలి

కొత్తూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి):రైతులకు యూరియా అందించేలా చర్యలు తీసుకోవాలని వైసీపీ నాయకులు కోరారు. సోమవారం కొత్తూరులో ఏవో స్వర్ణలతకు ఎంపీపీ సవర సావిత్రి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సూర్యనారాయణ వినతిపత్రం అందించారు.

గోశాలకు పశువుల తరలింపు

నందిగాం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): అలమంద సంతకు అనుమతులు లేకుండా ఒడిశా నుంచి రవాణాచేస్తున్న పది గేదెలు, రెండు దున్నపోతులను పట్టుకుని గుర్ల గోశాలకు తరలించారు.అక్రమంగా తరలిస్తున్న పశువులను నందిగాం ఎస్ఐ షేక్ మహ్మద్ ఆలీ పట్టుకున్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక జాతీయరహదారిసమీపంలో సిబ్బందితో తనిఖీలునిర్వహిస్తుండగా తెలంగాణలోని భువనగిరికి చెందిన డ్రైవర్ మందా నంరంజిత్‌ను పశువులను తరలిస్తుం డగా అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దీర్ఘాశిలో సరస్వతీ విగ్రహ ప్రతిష్ఠ

పోలాకి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి):దీర్ఘాశి జడ్పీ ఉన్నత పాఠశాలఆవరణలో సోమవారం సరస్వతీవిగ్రహాన్ని హెచ్ఎం, ఎంఈవో-2 ఎస్.శ్రీనివాసరెడ్డి వేదపండితులు ఆరవల్లి కృష్ణశర్మ, శ్రీనివాసశర్మల మంత్రోచ్చరణతో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురుభవానీ పల్లిరాజు తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సరస్వతీ విగ్రహాన్ని ఏర్పాటుచేశారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం పాటోటి రామచంద్రరావు, విద్యాకమిటీచైర్మన్ శీనివాసరావు, ఎంపీటీసీ పి.నీరజ పాల్గొంటారు.

పోలాకిలో రైతుల మహాజన సభ

పోలాకి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి):రైతులు యూరియా ఎరువుకోసం తపన పడి ఆందోళన చెందవద్దని పీఏసీఎస్ అధ్యక్షుడు బైరి భాస్కరరావు రైతులకు సూచించారు. సోమవారం పోలాకిలో రైతుల మహాజనసభ జరిగింది. కార్యక్రమంలో సీఈవో బి.రాంబాబు, ఎంపీ నాయుడు, పాలకవర్గసభ్యులు, డీసీసీబీ, సొసైటీ అధికారులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తాచాటిన బాలికలు

సంతబొమ్మాళి,సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి):మండలంలోని కొల్లిపాడు జడ్పీ పాఠశాల బాలికలు జిల్లా స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో సత్తాచాటారు.ఈ మేరకు 12 పతకాలు సాధించారని హెచ్ఎంరామారావు తెలిపారు. జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్‌ఆధ్వర్యంలో పొందూరులో యంగ్‌స్టార్ యూత్ క్లబ్ పోటీలు నిర్వహించింది. జంతుశాస్త్ర ఉపాధ్యాయుడు పిలక ధనుంజయకుమార్ కోచ్‌గా వ్యవహరించారు. బాలికలను పీడీ లు ఎన్.శ్రీనివాస్,డి.శంకరరావు అభినందించారు.

●మెళియాపుట్టి,సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పెద్దమడి గురుకుల కళాశాల విద్యార్థులు ఈనెల 27నుంచి నాగార్జునయూనివర్సిటీలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో సత్తాచాటినట్లు ప్రిన్సిపాల్ లక్షణనాయుడు తెలిపారు. గోవింద్ 110 మీటర్లు పరుగు పందెంలో, అశోక్‌కుమార్ హైజంప్,లాంగ్ జంప్‌లో కృపానంద్ రెండో స్థానం సాధించినట్లు పేర్కొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

పలాస రూరల్, సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి): 104 వాహన వైద్యసేవలో పని చేస్తున్న అధికారులు విధినిర్వహణలో అలసత్వం ప్రదర్శించకూడదని 104 డిప్యూటీ మేనేజర్ వెంకటనర్సింహమూర్తి తెలిపారు. సోమవారం మండలంలోని టెక్కలిపట్నంలో 104 వాహనంలో సేవలను ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా మందుల పంపిణీ, రికార్డుల నిర్వహణ, రోజుకు ఎంతమంది రోగులకు పరీక్షలు చేస్తున్నారు తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణను కచ్చితమైన సమయం పాటించాలని, ఆలస్యంగా విధులకు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ ప్రసన్నకుమారి, డేటా ఆపరేటర్ హరికృష్ణ, డ్రైవర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏపీటీపీసీ సర్వసభ్య సమావేశం


వజ్జ బాబూరావుకు మెమొంటో అందజేస్తున్న ఏపీటీపీసీ వైస్‌చైర్మన్, ఎండీ శేఖర్‌బాబు, డిప్యూటీ సెక్రటరీలు, సిబ్బంది

పలాస, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రొవిజన్ లావాదేవీలను ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు షేర్‌హోల్డర్లకు వివరించారు. సోమవారం అమరావతిలో ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ సమావేశమందిరంలో 56వ సర్వసభ్య సమావేశంజరిగింది. ఈ సందర్భంగా ఫైనల్ ఆడిట్ రిపోర్టు ఏజీ ఆడిట్ కాకపోవడంతో సర్వసభ్య సమావేశం వాయిదా వేస్తూ తీర్మానించారు. కాగ్ ఆడిట్ నివేదిక పూర్తయిన వెంటనే మరోసారి సర్వసభ్య సమావేశం ఏర్పాటుచేసి నిబంధనల ప్రకారం ముందుగానే తెలియజేసి ఆమోదిస్తామని చైర్మన్ బాబూరావు తెలిపారు. అనంతరం చైర్మన్‌కు పాలకమండలి సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో షేర్‌హోల్డర్లు వైస్‌చైర్మన్, ఎండీ డాక్టర్ శేఖర్‌బాబు, డిప్యూటీ సెక్రటరీలు ఎస్.హనుమంతరావు, ఎన్‌వీ వీరకుమారి, అసిస్టెంట్ సెక్రటరీ ఎం.వెంకటేశ్వర్లు, కంపెనీ సెక్రటరీ కరుణాకర్‌రెడ్డి, జీఎం ప్రసాద్ పాల్గొన్నారు.

సందడిగా పత్తిరోత్సవం


నందిగాంలో పత్తిరోత్సవం నిర్వహిస్తున్న రైతులు

నందిగాం, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి):నందిగాంతో పాటు బోరుభద్ర, హరిదాసుపురం, దేవుపురం తదితర గ్రామాల్లో దుర్గాష్టమి పురస్కరించుకొని సోమవారం పత్తిరోత్సవాన్ని సందడిగా నిర్వహించారు. రైతులు పత్తిరికొమ్మలను తీసుకువచ్చి అమ్మవార్ల వద్ద పూజలు నిర్వహించి తరువాత పొలాల్లో చల్లారు.ఏటా దుర్గాష్టమి నాడు పత్తిరోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

శ్రీముఖలింగేశ్వరుని హుండీ ఆదాయం రూ.2.13 లక్షలు

జలుమూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగేశ్వరాలయంలో గల హుండీ ఆదాయం 90 రోజులకు రు.2,13,803 వచ్చినట్లు ఈవో టి.వాసుదేవరావు తెలిపారు. సోమవారం మందస గ్రూపు ఆలయాల ఈవో ఎస్.నాగేశ్వరరావు సమక్షంలో హుండీలు తెరచి లెక్కించారు. దేవదాయశాఖ అసిస్టెంటు కమిషనర్ ఆదేశాల మేరకు హుండీ లెక్కించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కొమనాపల్లి సత్యసాయి సేవా సమితి సభ్యులు, అర్చకులు, దేవదాయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమ్మె నోటీసు

జలుమూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి):అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని గ్రామ సచివాలయ సిబ్బంది డీటీ రమేష్, డిప్యూటీ ఎంపీడీవో ఉమామహేశ్వరరావుకు సోమవారం సమ్మెనోటీసులు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేలా ఇంటింటికి తిరిగి చేసే పనులు అప్పగించవద్దని ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా స్పందించకపోవడంతో రాష్ట్ర కార్యవర్గం పిలుపుమేరకు సమ్మెచేయడానికి సిద్ధమైనట్లు తెలిపారు.

బోరుభద్రలో రక్తదానశిబిరం

సంతబొమ్మాళి,సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి):మండలంలోని బోరుభద్రలో ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన పక్షోత్సవాలు పురస్కరించుకుని రక్తదాన శిబిరంతో పాటు ఉచిత వైద్యశిబిరాన్ని సోమవారం ఏర్పాటుచేశారు.కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు, నాయకులు అట్టాడ రవిబాజ్జీ, చింతాడ చిన్నారావు, చింతాడ శ్రీనివాస్, బోరుభద్ర పీహెచ్‌సీ వైద్యాధికారి పీస ఆవని పాల్గొన్నారు.

పరిశుభ్రమైన వాతావరణానికి కృషి చేయాలి

పలాస రూరల్,సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ చెత్తను ఆరుబయట వేయకుండా పరిశుభ్రతమైన వాతావరణానికి కృషి చేయాలని కూటమి నాయకులు కోరారు.సోమవారం కిష్టుపురంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తడిచెత్త, పొడిచెత్తకు డస్ట్‌బిన్లను పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో శ్రీశయన సాధికారిక కమిటీ సభ్యుడు కృష్ణంరాజు, టీడీపీ మండల కార్యదర్శి సంతోష్‌కుమార్‌నాయుడు, టీడీపీ గ్రామఅధ్యక్షుడు తులసీరావు, బాబూరావు, బూర్లె డిల్లీరావు, బూర్లె ప్రసాదరావు, కార్యదర్శి సాయి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో తప్పెటగుళ్ల ప్రదర్శన

నరసన్నపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణవలస తప్పెటగుళ్ల బృందం తిరుమలలో జరుగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో సోమవారం తప్పెటగుళ్ల ప్రదర్శన నిర్వహించింది. మాడవీధుల్లో హనుమంతు వాహన సేవలో మలయప్పస్వామి తిరువీధి నిర్వహిస్తున్న సమయంలో 25 మంది సభ్యుల బృందం ప్రదర్శన ఇచ్చింది.ఆదివారం గరుడ వాహనసేవలో పాల్గొనున్నట్లు ఆర్గనైజర్ శిమ్మ లక్ష్మణరావు తెలిపారు.

వైద్య కళాశాలలు ప్రభుత్వమే నడపాలి

టెక్కలి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పీపీపీ ద్వారా నిర్వహించే వైద్య కళాశాలలను ప్రభుత్వమే నడిపేలా చర్యలు చేపట్టాలని కేఎన్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్క కృష్ణయ్య డిమాండ్‌చేశారు. సోమవారం టెక్కలిలో కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది.సమావేశంలో రాకోటి రాంబాబు, కె.కాళిదాసు, రమేష్ పాల్గొన్నారు.